# ఉద్యమ స్ఫూర్తితో ..కృషి చేయాలి

- **బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**
- **మన్నె గోవర్ధన్‌రెడ్డిని కలిసిన సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్**



హైదర్‌గూడలోని ఎంఎ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్/హిమాయత్‌నగర్,నవంబర్ 2: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంత చిత్తశుద్ధితో పనిచేశామో అదే స్ఫూర్తితో బీఆర్ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయం సాధించి పెట్టడం కోసం కలిసికట్టుగా పనిచేస్తామని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కే కేటాయించడంతో పార్టీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి గత కొంతకాలంగా నిరాశకు గురయ్యారు. కాగా మన్నె గోవర్ధన్‌రెడ్డికి తగిన గౌరవం ఇస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం మన్నె గోవర్ధన్ రెడ్డి ఇంటికెళ్లిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆయనతో సమావేశమయ్యారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి గులాబీజెండా ఎగురవేయడంలో సహకరించాలని గోవర్ధన్‌రెడ్డిని కోరారు. దీనికి స్పందించిన మన్నె గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడంతో పాటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేశామని, పార్టీ అధిష్టానం మీద నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ కవితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంచందర్, ప్రభాకర్‌రెడ్డి, రావుల విజయ్, నిస్సార్, జ్యోతి స్వరూప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


సభకు హాజరైన బూత్‌స్థాయి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు

## మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దు

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్,బీజేపీ పార్టీల నాయకులు చేప్పే మాయ మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. హిమాయత్‌నగర్ డివిజన్ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం హైదర్‌గూడలోని ఎంఎ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది.ఎన్నికల ప్రచారం, పోలింగ్ జరిగే సమయంలో అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ గృహలక్ష్మి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్,ఆసరా పెన్షన్లు,నిరంతరం విద్యుత్, రోడ్లు,డ్రైనేజీ, మంచి నీటి వంటి మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని పేర్కొన్నారు.బూత్ స్థాయి లో తిరిగే పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరిని కలిసి వారి సమస్యలను సైతం తెలుసుకో వాలన్నారు.ప్రజల ఆశీర్వాదంతో సీఎం కేసీఆర్ నాయకత్వంలో హ్యాట్రిక్ సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో హిమాయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు యాదగిరిసుతారి,నాయకులు యతిరాజు,అశోక్‌కుమార్, పి.ప్రభాకర్ గౌడ్, డి.రాజేందర్‌కుమార్,నందు, రాజేంద్రప్రసాద్,కృష్ణయాదవ్, గణేష్,శ్రీనాథ్, శ్రీకాంత్, మాధవి, కళ, మాన్సూర్,సోయల్‌జాబ్రీ,నరేష్, శివ, కృష్ణ, ముజాఫర్ ముస్సా తదితరులు పాల్గొన్నారు.


ఖైరతాబాద్ డివిజన్ బాలాపుర బస్తీలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌తో పాటు స్థానిక నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం


హిమాయత్‌నగర్: బీఆర్ఎస్‌పార్టీ శ్రేణులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్


ఫిలింనగర్ బస్తీల్లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఉద్యమకారులు


ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే దానం నాగేందర్

## ఎమ్మెల్యే దానం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన వారు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. గురువారం సోమాజిగూడలోని జయగార్డెన్స్‌లో కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం సమక్షంలో సమక్షంలో బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సందీప్, శ్రీదేవి, రాజేశ్, మంత్రి శ్రీనాథ్‌తో పాటు సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. – ఖైరతాబాద్, నవంబర్ 2



## బీఆర్ఎస్‌కు అండగా ఉండాలి


మ్యానిఫెస్టోలను అందజేసిన కార్పొరేటర్ సంగీత యాదవ్

ఖైరతాబాద్, నవంబర్ 2 : సోమాజిగూడ డివిజన్‌కు చెందిన డబుల్ బెడ్రూం లబ్ధిదారులతో కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్ సమావేశమయ్యారు. ఎంఎస్‌మక్తాలోని అన్సారీ మసీదు వద్ద మైనార్టీ లబ్ధిదారులతో సమావేశమైన కార్పొరేటర్ సంగీత యాదవ్ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా నిలిచి గెలుపునకు కృషి చేయాలని, ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 3 తర్వాత మిగతా లబ్ధిదారులందరికీ డబుల్ గృహాలు అందజేస్తారని తెలిపారు. అనంతరం సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వనం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి నామినేషన్ల స్వీకరణ



ఖైరతాబాద్‌లోని ఖైరతాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయం

బంజారాహిల్స్,నవంబర్ 2: ఖైరతాబాద్ నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 11 నుంచి ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు వేయడానికి వీలుగా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల 10 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుండడంతో రిటర్నింగ్ కార్యాలయం ఆవరణలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో సహా మొత్తం ఐదుగురు వ్యక్తులను మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతి ఇస్తారని రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రే తెలిపారు.

## ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి జరగడం దురదృష్టకరం

హిమాయత్‌నగర్,నవంబర్ 2: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తి దాడి జరగడం దుర దృష్టకరమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,ఖైరతాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామ చంద్రారెడ్డి అన్నారు. గురువారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హత్యా రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో హింసా,దాడుల సంస్కృతి మంచిది కాదని, ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు.


**చేరికలు:** బీఆర్ఎస్ పార్టీ నుంచి మూడు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన బంజారాహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత, ఉద్యమకారుడు మహ్మద్ జలాలుద్దీన్ గురువారం తిరిగి సొంతగూటికి చేరారు. ఖైరతాబాద్ నియోజకవర్గం సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో జలాలుద్దీన్ బీఆర్ఎస్‌లో చేరారు. – బంజారాహిల్స్,నవంబర్ 2